తీరప్రాంత గ్రామాల్లో దెబ్బతిన్న

కొబ్బరి తోటలను పరిశీలిస్తా!



- ఉప్పునీరు రావడంతో వేలాది కొబ్బరి చెట్లు మృత్యువాత పడ్డాయని నా దృష్టికి వచ్చింది
- పరిశీలించి సమస్యను పరిష్కరిస్తా
- జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటన

అమలాపురం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం సముద్రం తీరం వెంబడి ఉన్న కొబ్బరితోటల్లోకి సముద్రపునీరు చొచ్చుకు రావడంతో పాడైపోయిన కొబ్బరి చెట్లను తానే స్వయంగా పరిశీలిస్తానని జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడించారు. కోనసీమ ప్రాంతంలోని శంకరగుప్తం మేజర్ డ్రైన్ వెంబడి ఉన్న గ్రామాల్లోకి, ముఖ్యంగా కొబ్బరితోటల్లోకి సముద్రపునీరు చేరడం వల్ల కొబ్బరి చెట్లు తలలు వాల్చేసి వేల ఎకరాల్లో పంట దెబ్బతిందన్న విషయం నా దృష్టికి వచ్చింది. రాజోలుకు చెందిన జనసేన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఈ విషయాన్ని తన దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారంటూ పవన్‌కల్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. సముద్రపు పోటు సమయంలో ఉప్పునీరు వైనతేయపాయ నుంచి శంకరగుప్తం డ్రైన్‌లోకి అక్కడ నుంచి కొబ్బరితోటల్లోకి చేరడం వల్ల కొబ్బరి చెట్లు తలలు వాల్చేసి దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. ముఖ్యంగా కేశనపల్లి, కరవాక, గొల్లపాలెం, గోగన్నమఠం, శంకరగుప్తం సహా ఇలా 13 గ్రామాల రైతులు నష్టపోతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఆయా గ్రామాల్లో తానే స్వయంగా పర్యటించి కొబ్బరి పంటనష్టాన్ని పరిశీలిస్తానని పవన్‌కల్యాణ్ ప్రకటించారు. దసరా తర్వాత ఆ ప్రాంతంలో పర్యటించి రైతులను కలిసి కొబ్బరి తోటలను పరిశీలిస్తానని తెలిపారు. రైతాంగంతోపాటు ఇరిగేషన్, వ్యవసాయాధికారులు కొబ్బరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలతో చర్చించి పరిష్కారం కనుగొంటామని తెలిపారు.



దసరా సందడి!
దసరా సెలవులు సోమవారం నుంచి ప్రకటించడంతో ముందుగానే జిల్లాలోని పలు స్కూళ్లలో దసరా సంబరాలను నిర్వహించారు. పిల్లలకు ప్రత్యేక అలంకరణలు చేసి ఉత్సవ వాతావరణాన్ని నెలకొల్పారు. శనివారం అమలాపురంలోని భాష్యం స్కూల్‌లో కోలాటాలు, ఆటపాటలతో నిర్వహించి, చిన్నారులతో నవదుర్గల వేషధారణతో ఆకట్టుకున్న దృశ్యమిది. - అమలాపురం టౌన్

మాకు సీట్లు కావాలి..



స్త్రీలకు మాత్రమే.. గతంలో ఆర్టీసీ బస్ ఎక్కితే ముందు వరుసలో కొన్ని సీట్లు వెనుక పెద్ద పెద్ద అక్షరాలతో కనిపించేవి.. మరి నేడు ఏ బస్‌లో చూసినా మహిళలే ఉంటున్నారు.. అన్ని సీట్లలో వాళ్లే కూర్చుంటున్నారు. అందుకే పురుషులకు మాత్రమే అని కొన్ని సీట్లకు బోర్డులు ఏర్పాటుచేయాలి.. ఓ ప్రయాణికుడి డిమాండ్ ఇది..

అమ్మగారింటికి వెళ్లానంతే..!



ఓ భర్త మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లాడు. భార్య కనిపించలేదు. కంగారుపడి ఇల్లంతా వెతికాడు. చివరికి ఫోన్ చేశాడు. మా అమ్మవాళ్ల ఇంటికి కూర ఇవ్వడానికి వచ్చానని అవతల నుంచి సమాధానం వచ్చింది. 10 కిలోమీటర్ల దూరం.. వారానికి ఐదుసార్లు ఇదేం పని అని భర్త కాస్త కోపగించుకున్నాడు. బస్సు ఫ్రీయే కదా అని!.. భార్య సమాధానం విని భర్తకు దిమ్మతిరిగింది.

అబ్బే ఏమీ చేయనండి...

రాజమహేంద్రవరంలోని ఓ గృహిణి ఈమధ్య ఉదయం భర్త ఆఫీసుకు వెళ్లగానే ఆమె కూడా ఇంటికి తాళం వేసి వెళ్లి.. సాయంత్రం ఇంటికి చేరుతోంది. కొద్దిరోజుల తర్వాత పక్క వాటా ఆవిడ పలకరించి ఏదైనా ఉద్యోగంలో చేరారా ఆరాతీసింది. అబ్బే నేనేమీ చేయనండి.. ఫ్రీ బస్ కదా.. తునిలో ఉన్న మా అమ్మగారింటికి వెళ్లి వస్తున్నానంతే.. ప్రశ్నించిన మహిళకు నోట మాట రాలేదు మరి..!

పిలవడమే ఆలస్యం.. !



ఇటీవల కొవ్వూరులో ఒక ఇంట్లో ఒక వేడుక చేసుకున్నారు.. ఆ ఇంటావిడ.. అమ్మగారి ఊరెళ్లి వాళ్ల వీధిలో ఉన్నవాళ్లందరికీ ఫంక్షన్‌కు రావాలని చెప్పి వచ్చేసింది.. ఆ వీధిలోని మహిళలు ఒక్కరూ ఆగలేదు.. తెలిసినోళ్లు.. తెలియనోళ్లు యాభై మందిపైనే వచ్చి వెళ్లారు.. దాంతో ఆ ఇంటావిడకు ఏం చేయాలో పాలుపోలేదు..



బస్టాండ్‌లో రెడీ..గా
దూరప్రాంతాలకు ప్రయాణం చేసే మహిళలు..ఆర్టీసీ బస్టాండ్లలోనే అన్ని పనులు చేసుకుంటున్నారు.. శనివారం రాజమండ్రి ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక మహిళ జుట్టు దువ్వుకుంటూ ఇలా కనిపించింది.

ఆదివారం.. ప్రత్యేకం

ప్రయాణంలో.. పదనిసలు!



బస్..కిక్కిరిసి : రాజమండ్రి బస్టాండ్‌లో మహిళల పోటాపోటీ

మహిళల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాలను తెచ్చింది. అయితే స్త్రీ శక్తికి .. ప్రగతిశక్తి వణికిపోతోంది.కొనరు పనులపై ఎక్కువగా ప్రయాణాలు చేస్తుండడం, అవసరం లేకపోయినా 'ఫ్రీయే కదా!' అనే ధోరణి అవలంభిస్తుండడంతో నిజంగా అవసరం ఉన్న మహిళలు నరకం చూస్తున్నారు. వృద్ధులు, పిల్లలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం ఉద్యోగాలకు వెళ్లేవాళ్లు, విద్యార్థులు, రోజు వారీ అవసరాలపై తిరిగేవాళ్లు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నెల రోజుల్లో లక్షలాది మంది మహిళలు ఉచితంపై ప్రయాణాలు సాగించారు. పథకం రాక మునుపుకంటే రెండింతలు పైనే మహిళలు ప్రయాణిస్తున్నారని తేలింది. పరిమితికి మించి ప్రయాణి కులు ఎక్కడం నిషేధమైనా ఆ నిబంధన బస్సెక్కింది. దీంతో బస్‌ల మైలేజీ లీటరు డీజిల్‌కు 5.50 కి.మీ నుంచి 5కి తగ్గింది. టైర్ల అరుగుదల వేగమైంది. ఇలా విభిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

కొత్త బస్సులు కావాలి
ఆర్టీసీలో కొత్త బస్సుల అవసరత కనిపిస్తోంది. తూర్పుగోదావరి, కాకినాడకు చేరే 50 కొత్త ఎలక్ట్రికల్ బస్సులు వస్తాయని చెబుతున్నారు. అవి ఫిబ్రవరికి వచ్చే అవకాశం ఉంది. జిల్లాకు 50 బస్సుల చొప్పున కొత్తవి కావాల్సిందే. తూర్పుగోదావరి జిల్లాలో 285, కాకినాడ 291, కోనసీ మలో 300 కలిపి 876 బస్సులు ఉండగా.. 600 వరకూ ఉచిత ప్రయాణాలకు తిరుగుతున్నాయి.

- రాజమహేంద్రవరం/ అర్బన్/ కొవ్వూరు/నిడదవోలు/ కాకినాడ కార్పొరేషన్/ పిఠాపురం/సామర్లకోట/ ఆత్రేయపురం/రావులపాలెం

బంధువుల ఇళ్లకు క్యూ
నగరాలు, పట్టణాలకు పరిసరాల్లో ఉన్న గ్రామాలకు చెందిన మహిళలు ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. ఒకప్పుడు పెద్ద పెద్ద పనులు ఉంటేనే బస్సు ఎక్కే మహిళలు.. ఇప్పుడు చిన్నచిన్న అవసరాలకు, చిన్నచిన్న ఆనందాలకు బస్సులెక్కి పట్టణాలకు వస్తున్నారు. కొందరు బంధు వుల ఇళ్లకు క్యూకడుతున్నారు. మరి కొందరు షాపింగ్ చేస్తున్నారు.. ఇంకొందరు ఆలయాలకు వెళుతున్నారు.. ప్రతి బస్‌కి సుమారు 56 సీట్లు ఉంటాయి.. కానీ పలు రూట్లలో 100 నుంచి 120 మంది బస్సు ఎక్కుతున్నారు. దీంతో బస్ కిక్కిరిసిపోతోంది.

ఆలయాలకు వెళుతున్నాం..



మాది పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు. కాకినాడలో 11 రోజులపాటు జరగనున్న శ్రీపీఠం మహాశక్తి యాగంకి మేమంతా రావడానికి ఉచిత బస్సు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతిరోజు గ్రూపుగా వచ్చి వెళుతున్నాం. చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు. - విజయలక్ష్మి, మార్టేరు

- స్త్రీ శక్తికి.. ప్రగతి శక్తి వణుకుతోంది
- అధిక బరువుతో ప్రయాణిస్తున్న బస్సులు
- తగ్గిపోయిన మైలేజీ.. పెరిగిన సమయం
- నిత్య ప్రయాణికులకు ఆపసోపాలు
- నెలలో.. హ్యాఫ్రీ ఖర్చు రూ.23 కోట్లు

ఇదీ ఆలోచించాల్సిందే!
ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగుల్లో రోజువారీ ప్రయాణికుల కోసం కొన్నింటిని కేటాయించినా లేదా ఆ సమయాల్లో మహిళ రద్దీ తక్కువగా ఉండేట్లు చూసినా ఉద్యోగినులు, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.



వైజాగ్ నుంచి వాడపల్లి వచ్చాం..
విశాఖపట్నం కంచరపాలెం నుంచి వాడపల్లి వచ్చాం. ఇది నాల్గో శనివారం. తుని వరకూ బస్సులో వెళ్లి అక్కడి నుంచి అనకాపల్లి- విశాఖపట్నం వెళతున్నాం.

హ్యాఫ్రీగా తిరిగొస్తున్నారు!



పుణ్యక్షేత్రాలకు రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. వాడపల్లి వేంకటేశ్వర స్వామిని ప్రతి శనివారం 50 వేల నుంచి 70 వేల మంది భక్తులు దర్శించుకుంటారు. వీరిలో మహిళా భక్తుల శాతమే అధికం. ఉచిత బస్ ద్వారా వాడపల్లి చేరుకుంటున్న మహిళలు మాడవీధుల్లో ప్రదక్షిణలు చేసి ఉచిత దర్శనం చేసుకుంటున్నారు. ఉచిత అన్నప్రసాదం స్వీకరించి మళ్లీ ఉచిత బస్సు ద్వారా మహిళలు తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. అన్నవరం, అంతర్వేది, అయినవిల్లి, బిక్కవోలు లక్ష్మీగణపతి, పిఠాపురం పాదగయ క్షేత్రాలకు భక్తులు వెళుతున్నారు.



డ్రైవర్‌గారు.. మీరు ఫ్రీ కదా!
డ్రైవర్‌గారూ ఒకసారి మా అబ్బాయిని పట్టుకోండి.. బస్ ఎక్కిన తరువాత తీసుకుంటా.. శనివారం రద్దీగా ఉండడంతో రావులపాలెం బస్టాండ్‌లో ఒక మహిళ తన కుమారుడిని డ్రైవర్‌కు ఇచ్చి బస్సెక్కింది.

కండక్టర్లు, డ్రైవర్లకూ ఇబ్బందే..
మహిళా బస్సు ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లకు ఇబ్బందులు తప్పడంలేదు. సీటు కోసం పోటీపడే క్రమంలో టికెట్ తీసుకోవడం మరిచిపోతున్నారు. కొంతమంది అవగాహన లేక ఆధార్‌కార్డు తెచ్చుకోకుండా కండక్టర్లతో వివాదానికి దిగుతున్నారు. ఇంకొందరు ఉచితమే కదా దానికి టికెట్ ఎందుకని గొడవ పడుతున్నారు. ఎక్కడైనా చిన్నచిన్న తగాదాలు కండక్టర్లకు తలనొప్పిగా మారుతున్నాయి.



నెల ఖర్చు రూ.23 కోట్లు

జిల్లా	ప్రయాణికులు	రాబడి	ఫ్రీ టిక్కెట్లు	ఫ్రీ..మొత్తం	ఆక్యుపెన్సీ
కాకినాడ	34,46,175	20,23,54,098	21,18,454	7,68,36,103	61%
కోనసీమ	35,66,319	18,46,74,118	22,51,745	6,86,52,333	63%
తూర్పు	14,49,840	8,69,21,736	25,00,354	8,22,85,982	63%
ఉమ్మడి జిల్లా	84,62,334	47,39,49,952	68,70,553	22,77,73,822	62%

ఇవీ మా ఇబ్బందులు..

మాకు ఊపిరిసలపడంలేదు..



మహిళలకు ఉచిత ప్రయాణంతో కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. మహిళలతో బస్‌లు నిండిపోవడంతో బస్‌లో తిరగడానికే కష్టంగా ఉంటుంది. బస్‌లో ఊపిరిసలపడం లేదు. ఐనా ఓపికగా సహకరిస్తున్నాం.
- ఎస్ఎస్ఎస్.రావు, కండక్టర్, రావులపాలెం

దగ్గర దూరం వాళ్లే ఎక్కేస్తున్నారు..



మా బస్ నిడదవోలు నుంచి కాకినాడకు వెళుతోంది. మా బస్సులో దగ్గర దూరం మహిళలు ఎక్కేస్తున్నారు. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణించేవారు ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు.
- సుధీర్, కండక్టర్, నిడదవోలు

టిక్కెట్లు కొట్టి.. బస్‌లు నడపలేం..



సింగిల్ క్రూ విధానంలో నడిపే బస్సులకు డ్రైవర్లకు టిమ్ ఇస్తున్నారు. ఒకవైపు మహిళలను బస్సులో ఎక్కించాలి, మరోవైపు టిక్కెట్లు కొట్టాలి. ఈ దశలో బస్సులు నడపడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.
- దుర్గారావు, డ్రైవర్, ఏలేశ్వరం

ఆధార్ ఒరిజినల్ తేవాలి..



మహిళలు ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకొస్తే సమయం కలిసొస్తుంది. కొంత మంది జిరాక్స్, మరికొంత మంది మొబైల్ ఫోన్‌లో తీసి చూపుతున్నారు. దీనివల్ల సమయం వృథా అవుతోంది.
- సత్యవతి, కండక్టర్, కాకినాడ



పల్లెపోరుకు సమాయత్తం

ఈసీ ఆదేశాలతో కదలిక.. మొదలైన రాజకీయ చర్చలు.. అభ్యర్థులపై ఊహాగానాలు

మండపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తు మొదలైంది. ఎన్నికల నిర్వహణ కోసం ప్రాథమిక కసరత్తు ఆరంభించాలని జిల్లా యంత్రాంగానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేయడంతో ఆమేరకు యంత్రాంగంలోనూ కదలిక ప్రారంభమైంది. ఓటర్ల జాబితాల తయారీ, వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించిన విధులకు అధికారులు సమాయత్తమవుతున్నారు. 2021లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించారు. ఆయా పాలకవర్గాల పదవీకాలం వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ముగియనుంది. అయితే మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని ఎన్నికల సంఘం సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత తుది షెడ్యూల్ విడుదలవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా వచ్చే నెల 15వ తేదీలోపు వార్డుల పునర్విభజన, పలు పంచాయతీలను పురపాలక సంఘాల్లో విలీనం చేయడం, నగర పంచాయతీలుగా గుర్తించడం వంటివన్నీ పూర్తి చేయాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి 1న ప్రకటించిన శాసనసభ నియోజకవర్గాల ఓటరు జాబితాను ప్రాతిపదికగా తీసుకుని వచ్చే నెల 16 నుంచి నవంబరు 15లోగా పంచాయతీ వార్డుల వారీగా ఓటరు జాబితాలు సిద్ధం చేయాలి. నవంబరు 1 నుంచి 15లోపు ఎన్నికల అధికారుల నియామకం, 16 నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల వివరాలు, నిర్ధారించాలి. బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు చేయడం, కొత్తవి తీసుకోవడం, ఈవీఎంలతో నిర్వహించాలని నిర్ణయిస్తే ఆ ప్రకారం సిద్ధమవ్వాలి. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలతోపాటు ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అలాగే మండపేట, అమలాపురం, రామచంద్రపురం మున్సిపాలిటీలతోపాటు ముమ్మిడివరం నగర పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇక డిసెంబరు 15లోపుగా రిజర్వేషన్‌లు ఖరారు చేయాలి. ఈనెలాఖరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశాలు నిర్వహించాలి. వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికల ప్రకటన జారీచేసి అదే నెలలో పోలింగ్ ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.'

అంతటా రాజకీయ చర్చలు
ఎన్నికల కమిషన్ ప్రకటన నాటి నుంచి అటు మున్సిపాలిటీలు, ఇటు పంచాయతీల్లో రాజకీయ చర్చలు మొదలైపోయాయి. అభ్యర్థుల విషయంలో ఊహాగానాలు హల్‌చల్ చేస్తున్నాయి. వాస్తవానికి కూటమి పార్టీల మధ్య స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సీట్ల సర్దుబాట్లు ఉంటాయి. పంచాయతీల్లో పార్టీల ప్రమేయం లేకపోయినా రాజకీయపరమైన అవగాహనతోనే ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన పార్టీల మధ్య ఒక అవగాహనకు రావాల్సి ఉంటుంది. అలాగే రిజర్వేషన్ల ఖరారు మేరకే ఎవరు పోటీ చేయాలనేది నిర్ణయమవుతుంది. అయితే అంచనాల మేరకు గ్రామాల్లో తెర మీదకు ఇప్పటికే కొన్నిపేర్లు ప్రచారంలోకి వచ్చేస్తున్నాయి. మున్సిపాలిటీల్లో ప్రస్తుతం అలాంటి ఊహాగానాలేవీ లేకపోయినా ఈసారి తామే పోటీచేయాలనేవారు పావులు కదపడం ప్రారంభించారు. దీంతో స్థానిక ఎన్నికల ప్రక్రియ వేడి పుట్టిస్తోంది.


కలెక్టరేట్‌లో మత్స్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆక్వా, నాన్ ఆక్వా జోన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలి : కలెక్టర్

అమలాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆక్వా, నాన్ ఆక్వా జోన్లు, ఫ్రెష్ వాటర్ ఉప్పునీటి చెరువుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెలాఖరునాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మత్స్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో శనివారం మత్స్యశాఖ సచివాలయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. చెరువులను ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధివిధానాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 48,387 హెక్టార్ల విస్తీర్ణంలో చెరువులు ఉన్నాయన్నారు. ఆక్వా జోన్ చెరువుల రిజిస్ట్రేషన్‌లో రైతు వివరాలు, చెరువు విస్తీర్ణం, సర్వే నెంబరు భూయజమాని వివరాలు వయస్సు, ఆధార్, మొబైల్ నెంబరు వంటి వివరాలతో సహా ప్రత్యేకమైన అప్లికేషన్ ఫారాన్ని తయారుచేయాలని సూచించారు. గ్రామ, మండలస్థాయి కమిటీలతో సభలు నిర్వహించి ఆక్వా జోన్ భూముల రిజిస్ట్రేషన్ కోసం అభ్యంతరాలపై అభిప్రాయాలను సేకరించి వివరాలను ఆక్వా జోన్ చెరువులు, మత్స్యశాఖ పోర్టల్ ద్వారా గ్రామ, ఫిషరీస్ అసిస్టెంట్ ద్వారా వాటిని రిజిస్ట్రేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫ్రెష్‌వాటర్ చెరువులకు సంబంధించి నోటీసులు జారీ చేస్తూ పంచాయతీలో ఐదు రోజుల గడువును ప్రకటించి ఈనెల 27వ తేదీ నాటికి ఆక్వా జోన్లను నాన్ ఆక్వాజోన్లగా పరిగణించాలని సూచించారు. జిల్లా మత్స్యశాఖాధికారి డీవీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు వర్ధన్, ఎఫ్‌డీవో గోపాలకృష్ణ పాల్గొన్నారు.


పుల్లేటికుర్రులో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

పర్యావరణ సామర్థ్యాన్ని, జీవవైవిధ్య సమతుల్యతను పెంపొందించాలి

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కుమార్

అంబాజీపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ద్వారా పర్యావరణ సామర్థ్యాన్ని జీవవైవిధ్య సమతుల్యతను పెంపొందించి, ఆరోగ్యకరమైన శాశ్వత అభివృద్ధికి మార్గం సుగమం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలను ప్రతి నెల మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుతూ పచ్చదనం పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యత కోసం పాటుపడాలన్నారు.


మొక్క నాటుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

2047 నాటికి పచ్చదనం 50 శాతానికి చేరుకోవడమే ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం పర్యావరణానికి తీవ్ర ముప్పుగా ఉన్న ప్లాస్టిక్ భూతాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీపీవో శాంతాలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో మమత, తహశీల్దారు చినబాబు, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, ఏపీవో అడపా వెంకటకృష్ణ, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వీరా రవి పాల్గొన్నారు.



సండే స్పెషల్‌గా తాను ప్రేమతో వండిన మటన్ బిర్యానీని రాఘవ ఎంతో ఆబగా తింటున్నాడు. భార్య సుహాసిని మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. తన వంట భర్తకు నచ్చితే భార్యకు పండగే. భర్త భోజనం చేస్తుంటే సుహాసిని దేనికోసమో ఆత్రంగా ఎదురుచూస్తున్నట్టు ఆమె కనులు స్పష్టంగా చెబుతున్నాయి... భోజనం ముగించి హాలులో కూర్చున్న భర్త ఏదో మాట్లాడాలని సుహాసిని ఆశిస్తోంది...




ఆ రోజు తమ పెళ్లి రోజు. ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న గులాబీ రంగు చీర కట్టుకుని, నల్లతాచులా నిగనిగలాడుతున్న వాలు జడలో తెల్లని మల్లెలతో భర్త కోసం ఎదురుచూస్తోంది ఆకాంక్ష. భర్త అనిరుధ్ వచ్చాడు. అతనికి స్వాగతం పలికి కాఫీ ఇచ్చింది. దేనికోసమో ఆకాంక్ష భర్త వెనకాలే పచార్లు చేస్తోంది. అనిరుధ్ ఇదేమీ పట్టించుకోకుండా తన పనులు కానిచ్చుకుంటున్నాడు. ఆకాంక్ష హృదయంలో ఏదో అసంతృప్తి.



కట్ చేస్తే పొలంలో పని చేసుకుంటున్న రామయ్యకు భార్య సీతామహాలక్ష్మి భోజనం తీసుకెళ్లింది. కోడికూర ఎలా ఉంది' అని భర్తను ప్రశ్నించింది భార్య. 'లక్ష్మీ నీచేతితో ఏమి వండినా అమృతమే. కోడికూర అదిరిపోయింది.' అంటూ రామయ్య భార్యను ఆకాశానికెత్తేశాడు. సీతామహాలక్ష్మి ఆనందానికి అవధుల్లేవు.


రాఘవ, అనిరుధ్ విషయంలో ఏం జరిగింది. నిజానికి రాఘవకు భార్య మటన్ బిర్యానీ ఎంతగానో నచ్చింది. అనిరుధ్‌కు గులాబీరంగు చీరలో భార్య స్వప్నసుందరిలా సాక్షాత్కరించింది. లోలోపల వారిద్దరూ భార్యలను ఎంతగానో మెచ్చుకున్నారు. అయితే ఆ విషయాన్ని బయటకు చెప్పేందుకు అహం అడ్డుగా నిలిచింది. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ భార్యలు మాత్రం ఎంతో అసంతృప్తికి లోనయ్యారన్నది వాస్తవం.

శ్రీమతీ... అదుర్స్



(ఉప్పలగుప్తం-ఆంధ్రజ్యోతి)

అప్పటివరకు అమ్మ, నాన్న, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములే ప్రపంచంగా జీవించిన ఆడది వివాహ బంధంతో మరో ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. అక్కడ తనకు అంతా అపరిచితులే. భర్త మాత్రమే తన ప్రపంచం. అత్తవారి ఇంట్లో ఎవరు ఎలా ఉన్నా భర్త ప్రవర్తన తనకు అనుకూలంగా ఉంటే చాలనుకుంటుంది భార్య. తాను చేసే ప్రతి పనినీ భర్త మెచ్చుకోవాలని కోరుకుంటుంది. భర్త ఇష్టాలను తెలుసుకుని మసలుకుంటుంది. అయితే చాలా మంది భర్తలు మాత్రం భార్య పనులు నచ్చకపోతే శివతాండవం చేస్తారు. నచ్చితే మౌనమునులవుతారు. మౌనమెందుకండీ?? దోసె అదిరిందోయ్ అని భార్యను ప్రశంసించి చూడండి. రోజూ రుచికరమైన టిఫిన్లు మీ నోటికందుతాయి. బాగుంటే మెచ్చుకోవడం గొప్ప కాదండోయ్! నచ్చనప్పుడూ ప్రశంసించి భార్య హృదయాన్ని దోచుకోవచ్చు. వంకాయ కూరలో కారం ఎక్కువయ్యింది. 'కూర ఎలా ఉంది' అని భార్య అడిగితే బాగుందంటూనే లోపాన్ని ఎత్తి చూపొచ్చు. వంకాయ కూర అదిరింది శ్రీమతీ!! కొంచెం కారం తగ్గించి ఉంటే ఇంకా అదుర్స్ అని చూడండి. ఆ తర్వాత అన్నికూరలూ మీకు నచ్చేలా తయారవుతాయి. రోజూ ఏదో సందర్భంలో ఏదో ఒకలా భార్యపై ప్రశంసల జల్లు కురిపించి చూడండి. మీ దాంపత్య జీవితంలో ఆనందం వర్షిస్తుంది.



(సెప్టెంబరు 3వ ఆదివారం: భార్యలను ప్రశంసించే రోజు సందర్భంగా)

ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంలోనూ భార్యను ప్రశంసించవచ్చండీ. మా రాధ కాఫీ పెడితే అమృతమేనండీ అని మీ బంధువుల సమక్షంలో అన్నారనుకోండి. ఆ సమాచారం అలాఅలా మీ శ్రీమతికి చేరిందనుకోండి. ఇంకేముంది ఆ రోజు మీకు అన్నీ శుభ శకునములే. మరి ఇంకెందుకు ఆలస్యం?? భార్యను ప్రశంసించడం మొదలుపెట్టండి. అన్నట్టు ఈ రోజు భార్యలను ప్రశంసించే రోజంట. అందుకే ఈరోజే మీలో సగాన్ని మెచ్చుకోండి. అంటే మిమ్మల్ని మీరే మెచ్చుకుంటున్నారన్న మాట.

మహిళా... మాస్టార్లు

ఒకప్పుడు మహిళలంటే వంటింటి కుందేళ్లు అనేవారు.. నేడు అన్నింటా అతివలదే హవా!. అన్ని రంగాల్లోనూ తమదే పై చేయి అంటున్నారు. ఆటైనా... పాటైనా.. పోటీ పరీక్షలైనా.. ఆకాశమే హద్దు.. అవకాశం వదలొద్దు అన్న రీతిలో ప్రతిభ చూపుతున్నారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో మగవారికి దీటుగా సత్తా చాటుతున్నారు.



మెగా డీఎస్సీలో అతివలదే హవా

సగానికిపైగా ఉపాధ్యాయ పోస్టులు వారి సొంతం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కాకినాడ జిల్లాకు చెందిన ఓ బాలిక 600కి 600 మార్కులతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. గతంలో ఎవరూ సాధించలేని ఘనతను ఆమె సాధించింది. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాల్లోనూ మహిళలు పలు ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఇక తాజాగా విడుదలైన మెగా డీఎస్సీ-2025 ఫలితాల్లో తమకు తిరుగులేదని నిరూపించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించిన పోస్టుల్లో సుమారు 50 శాతానికిపైగా ఉద్యోగాలను అతివలే సంపాదించారు.



కాకినాడ జిల్లా చేబ్రోలులోని ఆదర్శ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చిన మహిళా అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఈసారి డీఎస్సీకి దరఖాస్తులు వెల్లువెత్తాయి. అన్ని మేనేజ్‌మెంట్లకు కలిపి 1241 పోస్టులు ఉండగా 63,004 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు 50 దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఈసారి పురుషుల కన్నా మహిళలే దరఖాస్తు నమోదులో ముందున్నారు. మొత్తం 38,617 మంది పరీక్షలు రాశారు. ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించి 111 పోస్టులకు పరీక్షలు నిర్వహించారు. వారితో కలిపి మొత్తం 1349 పోస్టులకు నిర్వహించిన డీఎస్సీ లో మహిళలు ప్రతిభ కనబరిచి ముందంజలో నిలిచారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ, టీజీటీ, పీజీటీ తదితర పోస్టులకు పురుషులతో సమానంగా మహిళా అభ్యర్థులు పోటీ పడ్డారు. తుది జాబితాకు ఎంపికైన వారిలో 654 మంది అంటే 48.4 శాతం మంది పురుషులు ఉండగా.. 695 (51.6 శాతం) మంది మహిళలు ఉన్నారు. ఇందులో గవర్నమెంట్/లోకల్ బాడీస్‌కు పురుష అభ్యర్థులు 540 మంది కాగా మహిళా అభ్యర్థులు 490 మంది ఎంపికయ్యారు. మున్సిపల్ స్కూళ్ళకు పురుష అభ్యర్థులు 31, మహిళా అభ్యర్థులు 41 మంది, మున్సిపల్ కార్పొరేషన్‌కు పురుషులు 50 మంది, మహిళలు 85 మంది, ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) పాఠశాలలకు సంబంధించి 33 మంది పురుష ఉపాధ్యాయులు, 79 మంది మహిళా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. పురుషుల కంటే మహిళలు సుమారు 41 మంది అధికంగా ఉద్యోగాలు సంపాదించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థుల వివరాలు ఇవీ..

సబ్జెక్టు	పురుషులు	మహిళలు	మొత్తం
ఎస్ఏ (తెలుగు)	23	35	58
ఎస్ఏ (ఇంగ్లీష్)	50	45	95
ఎస్ఏ (హిందీ)	12	66	78
ఎస్ఏ (బయాలజీ)	45	62	107
ఎస్ఏ (ఫిజికల్ సైన్స్)	55	19	74
ఎస్ఏ (గణితం)	44	20	64
ఎస్ఏ (సోషల్ స్టడీస్)	84	48	132
ఎస్ఏ (పీఈటీ)	142	69	211
సంస్కృతం	3	2	5
ఎస్‌జీటీ (మైదానం)	167	254	421
ఎస్‌జీటీ (మన్యం)	28	76	104

సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ రత్నేష్‌కుమార్
- కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వస్తువుల వాడకానికి దూరంగా ఉండాలని, సందర్శకులకు ఆహ్లాదాన్నందించే సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఓఎన్‌జీసీ (ఈవో ఏ, హెచ్‌బీటీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ రత్నేష్‌కుమార్ కోరారు. అంతర్జాతీయ తీర ప్రాంత శుభ్రత దినోత్సవం సందర్భంగా ఓఎన్‌జీసీ, ఇండియన్ కోస్ట్‌గార్డు, రిలయన్స్, కాకినాడ సీపోర్టు లిమిటెడ్, కోస్టల్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో తీర ప్రాంత శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహ్లాదాన్ని అందించే సముద్రతీరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. సముద్ర పర్యావరణాన్ని కాపాడుకునేందుకు బీచ్‌లో ఎటువంటి ప్లాస్టిక్ వ్యర్థాలు వేయరాదన్నారు. సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఐక్యరాజ్యసమితి (యూఎన్‌ఈ పీ), దక్షిణాసియా సహకార పర్యావరణ కార్యక్రమం (ఎస్ఏసీఈపీ)ల ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబరు 3వ శనివారం ప్రపంచ వ్యాప్తంగా బీచ్ క్లీనప్ డే కార్యక్రమం పెద్దఎత్తున జరుగుతోందన్నారు. బీచ్‌లో ప్లాస్టిక్ తదితర వ్యర్థాలు కలుషితం కావడంతో తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థలోని సముద్ర జీవులు,మానవ ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు స్థానికంగా ఉన్న ఎన్‌జీవోలు, విద్యాసంస్థలు, యువతతో కలసి ఏటా తీర ప్రాంత శుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుమారు బీచ్‌లో 3గంటల సేపు బీచ్‌లో పేరుకుపోయిన సుమారు 1000 కిలోల ప్లాస్టిక్, చెత్తా వ్యర్థాలను సేకరించి, మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బందికి అప్పగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్, మున్సిపల్ కార్పొరేషన్, పలు కాలేజీల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం



ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డే సందర్భంగా సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుదామంటూ శనివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్‌లో రూపొందించిన సైకత శిల్పం. -సర్పవరం జంక్షన్(ఆంధ్రజ్యోతి).

లాకుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నీటిపారుదల శాఖ ప్రాజెక్టు చైర్మన్ సునీల్‌కుమార్

ఆలమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నీటిపారుదల వ్యవస్థలో కీలకంగా ఉన్న లాకుల వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టిసారించినట్టు నీటిపారుదల శాఖ ప్రాజెక్టు రాష్ట్ర చైర్మన్ సునీల్‌కుమార్, వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద కోరంగి కాలువపై ఉన్న ప్రధాన లాకులను శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల లాకులు దెబ్బతిన్నాయని, దీంతో ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నారు. వాటిని అభివృద్ధి చేసి నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచి రైతులకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్, సుధాకరరెడ్డిలను ఆలమూరు డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి సత్కరించారు. అనంతరం లాకుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందించారు.

1.04లక్షల ఎకరాలకు సాగునీరు: ఈఈ

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి వచ్చే నీటిని అదుపు చేసి పంట కాలువకు సాగునీరందించే చొప్పెల్ల ప్రధాన లాకుల ద్వారా 1,04,934 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వీవీ రామకృష్ణ తెలిపారు. లాకుల సందర్శనకు ప్రాజెక్టు టీంతో పాటు వచ్చిన ఆయన కొద్దిసేపు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రెండో పంటకు 94,500 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. మొదటి పంటకు రోజుకు 1000 నుంచి 1300 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని, అలాగే రెండో పంటకు 1600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్టు రామకృష్ణ చెప్పారు. ప్రస్తుతం లాకుల గేట్లు బాగా దెబ్బతిన్నాయని తక్షణం మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు.



చొప్పెల్ల లాకులను పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

భక్తవత్సల గోవిందా..గోవిందా

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆదాయం రూ.61.08 లక్షలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జోరువానను సైతం లెక్కచేయ్యకుండా అశేష భక్తజనం తిరువీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఆదాయం రూ.61.08 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.




వాడపల్లి వేంకటేశ్వరస్వామి



వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

నేడే చూడండి



అశోక	- రాజమండ్రి
ఆనంద్ సినిమాస్	- కాకినాడ
దేవి సినిమాస్	- కాకినాడ
ఎస్ఆర్ఎమ్‌టి ఐనాక్స్	- కాకినాడ
విపిసి కాంప్లెక్స్	- అమలాపురం
సప్తగిరి కాంప్లెక్స్	- మండపేట
పూర్ణ	- పిఠాపురం
నాగేశ్వర	- జగ్గంపేట
వెంకటేశ్వర	- రావులపాలెం
విఘ్నేశ్వర	- సామర్లకోట
కిషోర్	- రామచంద్రాపురం
శ్రీనివాస	- తాటిపాక
సత్యచంద్ర	- కొత్తపేట
పద్మజ కాంప్లెక్స్	- మలికిపురం
వీరేశ్వర	- యానాం

పంచాయతీలు సొంత ఆదాయాన్ని పెంచుకోవాలి: జడ్పీ చైర్మన్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీ సొంత ఆదాయాన్ని పెంచుకోవాలని, ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడకుండా ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సూచించారు. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీలు సొంత ఆదాయ వనరులను పెంచుకునే అంశంపై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆఖరి రోజు శనివారం వేణుగోపాలరావు పాల్గొని ప్రసంగించారు. జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను త్వరగా చేరుకునేందుకు మరింత సొంత ఆదాయ వనరులను పెంచుకునే అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తులో జరిగే మండల స్థాయి శిక్షణలు ఇదే విధంగా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల నుంచి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ వేణు, సీఈవో లక్ష్మణరావు

రాగి వైరు చోరీ

బిక్కవోలు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తన పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు చోరీకి గురైందని బలభద్రపురానికి చెందిన సబ్బెళ్ల బులివెంకటరెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం..బులివెంకటరెడ్డికి బిక్కవోలు-నల్లమిల్లి రోడ్డులో పామాయిల్ తోట ఉంది. దానిలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి వైరు దొంగిలించారని పక్క రైతు శనివారం ఉదయం ఫోన్ చేయడంతో ఆయన వెళ్లి పరిశీలించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

22 నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



అమలాపురంలో దేవీ నవరాత్రి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అమలాపురం మెయిన్‌రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 22నుంచి అక్టోబరు 2వరకు దసరా మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు శనివారం నిర్వాహకులు తెలిపారు. స్థానిక వాసవి ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన సమావేశంలో 22వ తేదీ ఉదయం అమ్మవారిని వెండి పల్లకీలో ఊరేగింపుగా 108కలశాలతో ఆర్యవైశ్య మహిళలు అభిషేక జలంతో అమ్మవారి ఆలయానికి వచ్చి ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహిస్తారు. 25న 102 మంది కన్యలతో కలశపూజ, 29న చిన్నారులతో సరస్వతీపూజ, అక్టోబరు 1న డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్‌తో ముగ్గురమ్మల మూలపుటమ్మ ఆధ్యాత్మిక ప్రవచనం జరుగుతుంది. విజయవాడలో కనకదుర్గమ్మను దసరా ఉత్సవాల్లో ఏ ఏ రూపాల్లో అలంకరిస్తారో శ్రీవాసవి మాతను కూడా అమలాపురంలో ఆయా రూపాల్లో అలంకరిస్తారు. ఈనెల26న రూ.3కోట్ల పైబడి కొత్త కరెన్సీ నోట్లతో శ్రీమహాలక్ష్మి అమ్మవారిగా వాసవీమాత భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. వైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు యెండూరు వెంకట్రామయ్య, అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ అప్పన వీరన్న, కోఛైర్మన్లు పచ్చిగోళ్ల సోమరాజు, నూలు శ్రీనివాస్, సంఘ ముఖ్య సలహాదారులు వంకాయల కాశీ, యెండూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, సలహాదారు నూలు కృష్ణ, పీఆర్వో కాళ్లకూరి బుజ్జి, లీగల్‌సెల్ సలహాదారునంబూరి మూర్తి, అదనపు కార్యదర్శి కాళ్లకూరి కుమార్, అదనపు కోశాధికారి యర్రమిల్లి సత్తిబాబు, కార్తీక వనసమారాధన కమిటీ ఛైర్మన్ సింగంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

యూటీఎఫ్ రణభేరిని విజయవంతం చేయాలి



మామిడికుదురు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థిక, ఆర్థికేతర అంశాల సాధన కోసం నిర్వహిస్తున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు పిలుపునిచ్చారు. రణభేరికి సంబంధించిన గోడపత్రికను శనివారం మామిడికుదురులో ఆవిష్కరించారు. గుంటూరులో ఈనెల25న రణభేరి కార్యక్రమం జరుగుతుందని, ఈకార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జి.నాగేంద్రప్రసాద్, సాయిబాబు, కపిల్, అరుణజ్యోతి, వరలక్ష్మి, శ్యామలావతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో ఎమ్మెల్యే

ముమ్మిడివరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. సీహెచ్ గున్నేపల్లిలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలకోటి దొరబాబు, నాయకులు గొలకోటి వెంకటరెడ్డి, గాలిదేవర బుల్లి, యాళ్ల ఉదయ్, గొలకోటి భాస్కరరామమూర్తి, గాలిదేవర స్వామినాయుడు, గొలకోటి తాతాజీ, గొలకోటి చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శి ఇందుమతి రామలక్ష్మి పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో శివకోడు విద్యార్థుల ప్రతిభ



రాజోలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ లో భాగంగా ఈనెల19న రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో శివకోడు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. అండర్-17 విభాగం నుంచి పాలపర్తి విజయ్‌కుమార్, కుసుమ క్రాంతికుమార్, అప్పారి అఖిలేష్, అండర్-14 విభాగం నుంచి అమలదాసు సతీష్‌చంద్ర, కానూరి శివచరణ్, గూడవల్లి జగత్ లు అర్హత సాధించారని తెలిపారు. క్రీడాకారులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు ఉండ్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

దస్తావేజు లేఖర్ల నిరసన



మామిడికుదురు రిజిస్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దస్తావేజు లేఖర్లు

మామిడికుదురు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలు నిరసిస్తూ దస్తావేజు లేఖర్ల రెండో రోజు నిరసన శనివారం కూడా కొనసాగింది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ పెన్‌డౌన్‌చేసి విధులను బహిష్కరించారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు, తాము అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలను రద్దుచేసి తమను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జక్కంపూడి సత్యనారాయణ, కోలా సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఇబ్బందులు తొలగించాలి

దస్తావేజు లేఖర్ల రెండోరోజు పెన్‌డౌన్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో క్రయ, విక్రయదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని దస్తావేజు లేఖర్లు రెండో రోజు శనివారం పెన్‌డౌన్ నిర్వహించారు. ప్రైమ్ 2.0ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సమయంలో ఓటీపీ ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటీపీతో సంబంధం లేకుండా మాన్యువల్‌గా చేసుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖర్ల సంఘం గౌరవాధ్యక్షుడు గుంటు ఫణిప్రసాద్, అధ్యక్షుడు జిన్నూరి సురేష్ ల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెణుతురుపల్లి సుబ్బు, పందరిశ్రీహరి, గుమ్మళ్ల సురేష్, కన్వీనర్ మట్టపర్తి రాము, కడలి సత్యనారాయణ, గుప్పి, లక్ష్మణ్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ కమిషనర్ పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి విజయవాడ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజీవ్‌కుమార్ శనివారం విచ్చేశారు. ఆయన ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి వారికి అందించారు.

క్రీడా పరికరాల వితరణ

అంబాజీపేట, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు క్రీడా పరికరాలను అందించారు. 1996-97బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.14వేలు విలువైన బాల్ బ్యాడ్మింటన్ రాకెట్స్, 1986-87లో చదివిన పూర్వ విద్యార్థి కె.అగ్నికుమార్ రూ.7వేలు విలువైన రెండు బాల్ బ్యాడ్మింటన్ రాకెట్స్‌ను హెచ్‌ఎం ఎ.వెంకట్రావుకు అందించారు. సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్‌ఎంసీ ఛైర్‌పర్సన్ ఎన్.రత్నమాల, పూర్వ విద్యార్థులు నీతిపూడి విలసిత మంగతాయారు, ఏ.వెంకట్ పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో మెరుగైన ఫలితాలు సాధించాలి



బండారులంకలో బోధనోపకరణాలను పంపిణీ చేస్తున్న ఏపీసీ మమ్మీ

అమలాపురంరూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేసిన బోధనోపకరణాలతో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.మమ్మి పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సెప్టెంబరు నెలకు నిర్వహించే పాఠశాల సముదాయ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆమె సందర్శించారు. బండారులంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థికి రోల్ మోడల్‌గా ఉండాలని, ప్రభుత్వం సరఫరా చేసిన బోధనోపకరణాలతో మేలైన ఫలితాలు సాధించాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఇందుపల్లి సాకుర్రు గరువు పాఠశాలలకు బోధనోపకరణాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్సు ఛైర్మన్ ఎస్ఎల్‌వీ బాల, ఇందుపల్లి హెచ్‌ఎం లంక రాణి, సాకుర్రు హెచ్‌ఎం పోతంశెట్టి దొరబాబు, కాంప్లెక్సు కార్యదర్శి కేవీఎస్ గౌడ, ఆర్పీ కె.కిశోర్‌కుమార్, సరిదే సత్యపల్లంరాజు, పెంకే వెంకటేశ్వరరావు, కుడుపూడి శ్రీదేవి, ఆకుల బసవేశ్వరరావుపాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు ముద్రిస్తే కఠినచర్యలు



పోలీసుస్టేషన్‌లో ప్రింటింగ్ నిర్వాహకులతో సమావేశంలో డీఎస్పీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు ముద్రిస్తే చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ హెచ్చరించారు. అమలాపురం సబ్‌డివిజన్ పరిధిలోని ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్వాహకులతో శనివారం అమలాపురం పట్టణం పోలీసుస్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఫ్లెక్సీలను ముంద్రించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన వివరించారు. ఫ్లెక్సీలపై అవమానపరిచే వ్యాఖ్యలు ముద్రిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రసాద్ హెచ్చరించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్ఐ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

ముందస్తు దసరా ఉత్సవాలు



ముమ్మిడివరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని శ్రీబాలాజీ కాన్వెంట్‌లో విద్యార్థులకు దసరా పండుగ విశిష్టతపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో నవదుర్గల వేషంలో విద్యార్థినులను అలంకరించారు. పాఠశాల ఆవరణలో రావణుని ప్రతిమను ఏర్పాటుచేసి రావణ సంహారం ఎలా జరిగిందో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు పీవీఎస్ శాస్త్రి, పి.సుజాత, హెచ్‌ఎం వీవీ రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్వస్థ నారీ.. సశక్త్ పరివార్'ను సద్వినియోగం చేసుకోవాలి



పి.గన్నవరం: కె.ఏనుగుపల్లిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

అంబాజీపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కేవీఎన్ శ్రీనివాస్ అన్నారు. నందంపూడి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పితాని మంగాదేవి ఆధ్వర్యంలో సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు సీమంతం చేశారు. సీహెచ్‌వో బి.అప్పారావు, పీహెచ్ఎన్ భూలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎస్వీ మహాలక్ష్మి, నాయకులు పితాని వీరాస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా రాజులపాలెం, కె.ఏనుగుపల్లి గ్రామాల్లో శనివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య పరీక్షలు అనంతరం ఉచితంగా మందులు అందించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ తోలేటి బంగారునాయుడు, డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ ప్రియాంక, ఎంపీటీసీలు నేలపూడి దామోదర్, కొల్లే సూర్యనారాయణ, సొసైటీ ఛైర్మన్ బొరుసు సత్యనారాయణ, నగరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ నిమ్మకాయల వెంకటలక్ష్మి, నాయకులు తోలేటి సత్తిబాబు, శేరు శ్రీనుబాబు, శేరు మంగతాయారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

కొత్తపేట, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వీఆర్‌ఏలకుఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలని కోరుతూకొత్తపేట ఆర్డీవో ఎదుట డివిజన్ స్థాయి వీఆర్‌ఏలు నిరసన తెలిపారు. ఆర్డీవో పి.శ్రీకర్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏల సంఘ నాయకులు ఆంజనేయులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంపై దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం పడమటిపాలెం సచివాలయంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కందికట్ల రమణకుమారిపై దాడి చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ తీవ్రంగా ఖండించింది. రమణకుమారిపై దాడికి పాల్పడ్డ రేకపల్లి దొరబాబు, అడబాల వెంకటనాగసత్యవతిలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు నాన్ బెయిలబుల్ కేసులు నమోదుచేసి ఇటువంటి సంఘటనలు పునరావృతంకాకుండా చూడాలని ఉద్యోగ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ డిమాండ్ చేశారు. ఏఎన్ఎం రత్నకుమారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అండగా నిలవాలని కోరారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.మల్లిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజ్‌కుమార్, కోశాధికారి జి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి లక్షపత్రి పూజ



వీరేశ్వరస్వామికి లక్ష మారేడు దళాలతో పూజ

ఐ.పోలవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మాసశివరాత్రి పురస్కరించుకుని మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేతవీరేశ్వరస్వామికి శనివారం లక్ష మారేడు దళాలతో అభిషేక పూజ నిర్వహించారు.ఆలయ పురోహితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి, అర్చకుడు యనమంద్ర సుబ్బారావు ఆధ్వర్యంలో గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అసిస్టెంట్‌కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాగాభట్ల శ్రీరామ్‌శర్మ, కిశోర్‌శర్మ, శశిశర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు

కొత్తపేట, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీజన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం జడ్పీ బాలకోన్నత పాఠశాలలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



ఉప్పలగుప్తం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన గొల్లవిల్లి సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, పంచాయతీ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొని ఉద్యోగుల సేవలను ప్రశంసించారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ, సొసైటీ ఛైర్మన్ మంచెం బాలకృష్ణ, నీటిసంఘం ఛైర్మన్ నల్లా సత్యనారాయణ, గొలకోటి సత్తిరాజు, మారిశెట్టి పుండరీకాక్షుడు, మద్దింశెట్టి సీతారామస్వామి, పిల్లా బుజ్జి, అరిగెల నరేష్, మారిశెట్టి నరేష్, బడుగు గణేష్, చప్పిడి దుర్గారావు, నాగారపు అర్జునరావు, మారిశెట్టి రాముడు, జొన్నాడ చిన్నా, పంచాయతీ కార్యదర్శి ఎండీ షెహెన్‌షా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రతో ఆరోగ్యవంతమైన గ్రామాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంతో ఆరోగ్యవంతమైన గ్రామాలుగా ఏర్పడతాయని గ్రామ సర్పంచ్ బొండాడ నాగమణి అన్నారు. పి.గన్నవరం అంబేడ్కర్ కాలనీలో శనివారం ఆమె మొక్కలు నాటి అనంతరం మాట్లాడారు. అదే విధంగా ర్యాలీ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి, కార్యదర్శి నిమ్మకాయల వీరవెంకటసత్యనారాయణ(చంటి), సచివాలయం ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఛైర్మన్ వెంకటలక్ష్మికి అభినందనలు

రాజోలు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో రాజోలు ఏఎంసీ ఛైర్మన్ కేతా వెంకటలక్ష్మి జన్మదిన వేడుకలు శనివారం అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను ఆమె కట్‌చేసి అందరికీ పంచారు. వెంకటలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గుబ్బల నాగభూషణం, చిట్టూరి సంతోష్, నాగిరెడ్డి గోపి, భైరిశెట్టి మధు, భైరిశెట్టి గణేష్, పవన్, చెల్లుబోయిన భాను పాల్గొన్నారు.

యానాంలో భారీ వర్షం

● జలమయంగా రోడ్లు



యానాంలో భారీ వర్షానికి జలమయమైన స్కూల్ ప్రాంగణం

యానాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యానాంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటకుపైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు క్రీడా ప్రాంగణాలు చెరువులను తలపించాయి. పాఠశాలలు విడిచిపెట్టే సమయం కావడంతో విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. మూసుకుపోయిన డ్రైన్లు, నిలిచిపోయిన ముంపు ప్రాంతాలను, సిబ్బంది చక్కదిద్దారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం రెండు గంటలు కుండపోత వర్షం కురిసింది. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయం, విద్యార్థులు స్కూల్ నుంచి ఇంటికి వెళ్లే సమయం కావడంతో ప్రజలు, విద్యార్థులు వర్షానికి నానా ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షంతో రహదారులు జలమయమయ్యాయి.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శనివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పెద్దపెద్ద ఉరుములతో భారీ శబ్దాలతో వర్షం కురిసింది.



అంబాజీపేటలో కురుస్తున్న వర్షం

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి
మామిడికుదురు, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నగరం గ్రామంలో నిర్వహించారు. సర్పంచ్ పాల్గొని మొక్కలు నాటారు. ముఖ్రం హుస్సేన్, జాలెం సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం
కె.గంగవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఓ.వీ. రమణను శనివారం పామర్రు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సన్మానించారు. శనివారం కాంప్లెక్స్ చైర్మన్ ఎర్ర ఈశ్వరుడు, కూళ్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించారు.

పీహెచ్‌సీలో సిబ్బంది కొరతపై స్థానికుల ఫిర్యాదు


వైద్య శిబిరంలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావుదొర

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావుదొర తెలిపారు. గొల్లవిల్లి సచివాలయం వద్ద శనివారం జరిగిన స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా శిబిరానికి వచ్చిన ప్రజలు ఉప్పలగుప్తం పీహెచ్‌సీ 24 గంటల ఆసుపత్రిఅయినప్పటికీ రాత్రి సమయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ఆయనకు ఫిర్యాదు చేశారు. ముగ్గురు స్టాఫ్‌నర్సులకు ఒక్కరే ఉన్నారని వైద్యాధికారి లంకే నాగార్జున వివరించారు. పాము, కుక్క కాట్లకు అమలాపురం వెళ్లాల్సి వస్తోందని స్థానికులు డీఎంఅండ్‌హెచ్‌వోకు విన్నవించారు. ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశం ఏర్పాటుచేసి తనకు సమాచారం అందించాలని ఉప్పలగుప్తం పీహెచ్ వైద్యాధికారికి డీఎంఅండ్‌హెచ్‌వో సూచించారు. కాగా ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాల్లో గైనకాలజిస్టులు లేకుండా మహిళలకు, గర్భిణులకు ప్రత్యేక వైద్యసేవలు ఎలా అందుతాయని మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ జిల్లా వైద్యాధికారిని ప్రశ్నించారు. గైనకాలజిస్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, మాజీ సర్పంచ్ గుత్తుల సుభాష్‌చంద్రరావు, నల్లా సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, గుత్తుల బాబ్జి, మారిశెట్టి పుండరీకాక్షుడు, మద్దింశెట్టి సీతారామస్వామి, బడుగు గణేష్, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్స్‌తో విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపు


అనాతవరం స్కూలును పరిశీలిస్తున్న జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, మోనిటరింగ్ అధికారి రాంబాబు

ముమ్మిడివరం,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లోని కార్యక్రమాలను అటల్ క్యాలెండర్ ఆధారంగా అమలు చేయాలని జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి గిరజాల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అనాతవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, కొమానపల్లిలోని జడ్పీ హైస్కూలుల్లోని సైన్స్ ల్యాబ్‌లను వారు శనివారం సందర్శించారు. కోనసీమ జిల్లాలో సైన్స్ ల్యాబ్‌ల వినియోగంపై అధికారులకు వారు సూచనలిచ్చారు. జిల్లాలోని పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని వారు సూచించారు. సైన్స్ ల్యాబ్‌లను పాఠ్యాంశాలకు అనుసంధానంగా వినియోగిస్తే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్ఎంలు కె.రాధ, విత్తనాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ
ముమ్మిడివరం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): కొమానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం శనివారం సందర్శించారు. విద్యార్థులు ఎసెస్‌మెంట్ పుస్తకాలు పరిశీలించి పరీక్షల్లో 35మార్కులు దాటిన విద్యార్థులను వారు అభినందించారు. పదో తరగతి విద్యార్థులకు వారు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడుఎస్.రాంబాబు, కేఎస్వీ త్రిమూర్తులు, ఆర్.నాగార్జునరావు, ఎస్ఎన్ మునేశ్వరరావు, కె.సూర్యనారాయణమ్మ, పి.వికాశిని, సాధనాల శ్రీనివాసరావు, ప్రసాద్, ఎస్.శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావుపాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ
ఆలమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్‌రణబేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈనెల25న గుంటూరులో చేపట్టిన యూటీఎఫ్ రణబేరి సదస్సులకు సంబంధించిన పోస్టర్‌ను ఆలమూరులో ఆవిష్కరించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో


బట్టేలంకలో విద్యార్థులకు సైన్స్ కిట్లు అందిస్తున్న సలీంబాషా

మలికిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా అన్నారు. శనివారం బట్టేలంక జిల్లాపరిషత్ హైస్కూలులో మండలంలోని ఉన్నత పాఠశాలలకు మంజూరైన సైన్స్ కిట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈసందర్భంగా జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ఉన్నత పాఠశాలల్లోను అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రతీ పాఠశాలలో 90శాతంపైగా ఉపాధ్యాయుల పనితీరు చాలా బాగుందన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు గ్రామాల్లో దాతలు అందిస్తున్న సేవలు, సహాయం మరువలేమన్నారు. ఎంఈవోలు ఎం.విజయశ్రీ, వైవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, గ్రామపెద్దలు ముదునూరి గోపాలకృష్ణంరాజు, విష్ణుమూర్తి రాజు, రమేష్‌రాజు, అల్లూరి రామచంద్రరాజు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ
ముమ్మిడివరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఇటీవల జరిగిన కరాటే పోటీల్లో ముమ్మిడివరం విబ్జియార్ ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులు పన్నెండు పతకాలు సాధించారు. నలుగురు విద్యార్థులు బంగారు, ఐదుగురు విద్యార్థులు రజత, ముగ్గురు కాంస్య పతకాలు సాధించినట్టు కళాశాల ప్రసాద్ విష్ణుప్రియ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాష్టారు రారాజు, సీనియర్ మాష్టారు పీవీఎస్ఎన్ వర్మ, చిక్కాల పరశురాముడు, జి.గుబ్బలదాసు, కె.శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న చంద్రశేఖర్ తదితరులు

అమలాపురంటౌన్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ క్రీడాకారులు ఎంపికైనట్టు జిమ్ లైఫ్ మెంబర్ గారపాటి చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన స్కూలు గేమ్స్ ఫెడరేషన్ వెయిట్‌లిఫ్టింగ్ అండ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం హెల్త్‌అండ్‌ఫిట్‌నెస్ జిమ్ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు జి.దినేష్ ప్రసాద్ అండర్-17 విభాగంలో, 79కిలోల కేటగిరిలో కె.నాని స్వర్ణ పతకం, 88కిలోల విభాగంలో వి.సోమశేఖర్ స్వర్ణ పతకం సాధించి రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ అండ్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కరించారు. సీనియర్‌నేషనల్ వెయిట్ లిఫ్టర్ మారే వీరేంద్ర, జె.సత్యగోపాల్, చోడే శంకరనారాయణ పాల్గొన్నారు.

తీరాన్ని కాలుష్యం నుంచి రక్షించుకుందాం
ఉప్పలగుప్తం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సాగర తీరాన్ని కాలుష్య కోరల నుంచి రక్షించుకుందాం రండని అగ్నికులక్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే భీమరాజు పిలుపునిచ్చారు. శనివారం ఎస్.యానాం బీచ్ పరిసరాల్లో స్వచ్ఛ సాగర్- సురక్షిత సాగర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు, స్థానికులతో కలిసి తీరప్రాంతంలోని చెత్తాచెదారాలను తొలగించారు. ప్రజల సహకారం లేనిదే కాలుష్య నివారణ, స్వచ్ఛ సాగర్ సాధ్యం కాదన్నారు. స్వచ్ఛ సాగర్- సురక్షిత సాగర్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

గర్భిణులకు సీమంతాలు
ఆత్రేయపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆడబిడ్డల ఆరోగ్యం పదిలం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించి పౌష్టికాహార ప్రాముఖ్యత గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంత రం సీమంతాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు పద్మావతి, నాగసత్యవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు అవకాశం
ముమ్మిడివరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలుచేసిన వారు ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌లో వాటిని రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. అక్టోబరు 23లోపుగా అనధికార ప్లాట్లు కలిగిన వారందరూ ఎల్ఆర్ఎస్ స్కీములో వెబ్‌సైట్‌లో లైసెన్స్ టెక్నికల్ పర్సన్ లాగిన్‌లో లేదా సిటిజన్ లాగిన్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకుని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలని సూచించారు. రెగ్యులరైజేషన్ చేసుకోని ప్లాట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబడవన్నారు. ఎటువంటి మౌలిక వసతులు కల్పించమని, భవిష్యత్తులో చట్టప్రకారం ఇబ్బందులు కలుగుతాయన్నారు. సందేహాలుంటే నగర పంచాయతీ పట్టణ ప్రణాళికా విభాగాన్ని సంప్రదించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి
ముమ్మిడివరం,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి పర్యావరణ పరిరక్షణను ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. స్వచ్ఛ దివస్-స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ముమ్మిడివరం బాలయోగి కాల్వ గట్టు రోడ్డులో, ఆటోస్టాండు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈ కె.శ్రీనివాస్, టీపీవో బి.రాజేష్‌బాబు, టీడీపీ నాయకులు కడలి నాగు, నగర పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ ఎం.రామకృష్ణప్రసాద్, జి.సూర్యసునీత, సచివాలయ, మెప్మా, నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో రాజ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



అంతర్వేది, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి ఎంపీడీవోగా పీఆర్వీ రాజ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఉప్పలగుప్తంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. మండలంలో ఎఫ్ఏసీ ఎంపీడీవోగా పనిచేసిన కె.సూర్యనారాయణ డిప్యూటీ ఎంపీడీవోగా ఇక్కడే కొనసాగుతున్నారు. రాజ్‌కుమార్‌ను సూపరింటెండెంట్ సోమేశ్వరి, అధికారులు, సిబ్బంది శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

శంకరరావు సేవలు అమూల్యమైనవి
మామిడికుదురు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ సంఘ అభివృద్ధికి దివంగత వాసంశెట్టి శంకరరావు విశేష కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం తరఫున ఆయన సతీమణి కనకాదుర్గాదేవికి రూ.60,101 అందించారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి కాండ్రేగుల రాము, కన్వీనర్ గుబ్బల శ్రీనివాస్, కాండ్రేగుల శ్రీనివాస్, బొక్కా వెంకటేశ్వరరావు, గుబ్బల మనోహర్, కడలి నూకరాజు, పెచ్చెట్టి సత్యచంద్ర, జోగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలి
మామిడికుదురు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో ముందుకు వచ్చి ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని డీఆర్డీఏ పీడీ ఎస్.జైచంద్రగాంధీ, నగరం సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో జి.భవానీ అధ్యక్షతన జిల్లాపరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ఎంఎస్ఎంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు అందిపుచ్చుకుని మహిళలు వ్యాపార, సేవ తయారీ రంగానికి సంబంధించిన యూనిట్లను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవర్మ, చిన్నతరహా పరిశ్రమల బ్యాంకు మేనేజర్ టి.శ్రీనివాసరావు, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం
మలికిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేశనపల్లిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కల్వకొలను రాంబాబు కుటుంబానికి శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో వంట సామగ్రి, నిత్యావసరాలు, తదితర వస్తువులు అందించారు. కార్యక్రమంలో జంపన బుజ్జిరాజు, అల్లూరి మధురాజు, మాజీ సర్పంచ్ యెనుముల నారాయణస్వామి, బోనం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవో సేవలు ఆదర్శనీయం
అల్లవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసి అందరికీ ఆదర్శంగా నిలిచిన ఇన్‌చార్జి ఎంపీడీవో బి.లక్ష్మణరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ప్రజాప్రతినిధులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బి.లక్ష్మణరావు పదోన్నతిపై తాళ్లరేవు ఎంపీడీవోగా బదిలీ అయిన సందర్భంగా శనివారం ఘనంగా సన్మానం చేశారు. లక్ష్మణరావు-లత దంపతులను ఎంపీపీ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమీ, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో గౌరీకుమారి, తహశీల్దార్ ఎంవీవీ నరసింహారావు, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, సాధనాల వెంకట్రావు, రాయుడు విష్ణు, దాకారపు చిరంజీవి, తిక్కిరెడ్డి శ్రీనివాస్, కడలి గంగాచలం, సుందరనీడి సాయిబాబు, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎస్.రాజమోహన్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన
కాట్రేనికోన, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి):కాట్రేనికోనమావుళ్ళమ్మ ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీఆదిగణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం శ్రీఆణివిళ్ళ వెంకటరమణ శాస్త్రి సేవాట్రస్టు, గ్రామప్రజలు, వర్తక సంఘాలు, జాతర భక్త బృందాల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఆణివిళ్ళ సాయిబాబా, రామకృష్ణపరమహంస, బ్రాహ్మణసేవాసంఘ అధ్యక్షుడు ఆకొండి ఉమామహేష్, రాష్ట్ర బీజేపీ కోశాధికారి గ్రంధి నానాజీ, ఆణివిళ్ళ ఫణికాంత్‌శాస్త్రి, చెరుకు బాపిరాజు, తాతపూడి గోపి, యల్లమిల్లి రమేష్, చెరుకు కృష్ణ, గ్రంధి రామ్‌ప్రసాద్, సంసాని పాండురంగారావు, సంసాని సత్యనారాయణ, గ్రంధి సత్తిబాబు, శ్రీరామ్, పండు, పవన్, గ్రంధి రాముడు, వేదుల శ్రీను, ఆకొండి రాధ, మంత్రిప్రగడ శ్రీనివాస్, ఆణివిళ్ళ వాసు, తాతపూడి బుల్లి తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ
అల్లవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు పంచాయతీ వద్ద సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు అడపా శ్రీనివాస్, రోళ్ల శ్రీను, ఓలేటి పరమేశ్వరరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ముత్యాల బాబి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్లకు డబ్బులు కట్టమనడం సరికాదు
మలికిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 2019లో గ్రామ పంచాయతీలకు పంపిణీ చేసిన ఎల్ఈడీ విద్యుత్ లైట్లకు ఇప్పుడు పంచాయతీ డబ్బులు కట్టాలని ప్రభుత్వం ఆదేశించడం దురదృష్టకరమని మలికిపురం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు యెనుముల నాగు అన్నారు. 2019లో నారా లోకేశ్ పంచాయతీరాజ్ మంత్రిగా ఉండగా ఎల్ఈడీ లైట్లు ఇచ్చారని అన్నారు. 2025లో జనవరిలో వేయాల్సిన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు అప్పటి వీధి దీపాలకు జమ చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. చాలా పంచాయతీల్లో జనరల్ ఫండ్ లేదని, స్టాంప్ డ్యూటీ, ఇతర ఆదాయాలు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పటి బల్బులకు ఇప్పుడు డబ్బులు కట్టమనడం సరికాదని, ఒకసారి పునరాలోచించాలని ఆయన కోరారు.

గోడి గురుకుల విద్యార్థికి గాయాలు
అల్లవరం,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): గోడిడాక్టర్ బీఆర్ బాలుర, గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న జనుపెల్లకు చెందిన విద్యార్థి విజయ్‌కు గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం మొదటి అంతస్తు వద్ద దండెంపై బట్టలు ఆరవేస్తుండగా జారిపడి గాయపడ్డాడన్నారు. అమలాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్టు ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ తెలిపారు.

ఆలయాల్లో మల్లాడి ప్రత్యేక పూజలు
యానాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):వినాయక చవితి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా యానాం మెట్టకుర్రు వార్డు పరిధి రమాబాయినగర్, వెంకట్‌నగర్, భీమ్‌నగర్, అగ్రహారం, సిద్ధార్థనరగ్ తదితర గ్రామాల్లో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాలను ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రారంభించి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మల్లాడిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఫ్లెక్సీల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు రాస్తే కఠిన చర్యలు

డీఎస్పీ సుంకర మురళీమోహన్

కొత్తపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి ఫ్లెక్సీల్లో వివాదస్పద వ్యాఖ్యలతో ప్రింట్ చేస్తే వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సుంకర మురళీమోహన్ హెచ్చరించారు. శనివారం ఫ్లెక్సీ యజమానులతో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా యజమానులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఫ్లెక్సీలను పెట్టుకోవడానికి ఆయా శాఖల అనుమతి తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో సీఐలు శేఖర్‌బాబు, భీమరాజు, కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎమ్మెల్యే జోగేశ్వరరావు

మండపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కాంట్రాక్టర్‌కు సూచించారు. 8వ వార్డు పరిధిలో ఎంపీడీవో కార్యాలయ ప్రాంతంలో జరుగుతున్న డ్రైనేజీ పునర్నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ తాతారావు పని వివరాలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, 8వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి పెందుర్తి ప్రదీప్‌కుమార్, ముమ్మిడివరపు నారాయణరావు, జొన్నాడ పాపాయమ్మ, గోసాల పండుబాబు, మండపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ: సీఎం సహాయనిధి చెక్కులను 14 మంది లబ్ధిదారులకు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో మంత్రి సుభాష్ తనిఖీలు

ద్రాక్షారామ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 9, 10 తరగతి గదులకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన అడిగి తెలుసుకున్నారు. సుమారు పది మంది విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు అయ్యారనే విషయాన్ని తెలుసుకుని అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆయన ఆదేశించారు. విద్యా సంస్థలకు దూరంగా సిగరెట్లు, గుట్కా, మత్తు పానీయాల దుకాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను మంత్రి సుభాష్ ఆదేశించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కె.గంగవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఓ.వీ. రమణను శనివారం పామర్రు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సన్మానించారు. శనివారం కాంప్లెక్స్ చైర్మన్ ఎర్ర ఈశ్వరుడు, కూళ్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించారు.


రామచంద్రపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి సుభాష్


కె.గంగవరం మండలం కుందూరులో మొక్కను నాటుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకట రమణారావు, కూటమి నాయకులు


రాయవరంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మొక్కను నాటుతున్న ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దాం

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి సుభాష్

ద్రాక్షారామ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం శీలంసావరంలో పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలు ముందుకు రావాలని కోరారు. రామచంద్రపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో సమాజానికి ముప్పు ఉందని విద్యార్థులు, విద్యావంతులు దీనిపై విస్తృత ప్రచారం చేసి ప్లాస్టిక్ వాడకం తగ్గించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, డాక్టర్ సుధీర్, కూటమి నాయకులు సలాది నాయుడు, ఉండవల్లి శివ, కడియాల రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుందూరు సొసైటీ అధ్యక్షుడు జగతా రమణ అన్నారు. శనివారం గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో కొబ్బరి మొక్కలు నాటారు. గ్రామ కార్యదర్శి గౌరీ శంకర్ పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. గ్రామంలో తడి, పొడి చెత్తను సేకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు మేడిశెట్టి బాబి, పళ్ల చినబాబు, ముషిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

రాయవరంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

రాయవరం, (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని వక్తలు కోరారు. పర్యావరణ రక్షణకు మొక్కలు పెంచాలని ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన పిలుపునిచ్చారు. శనివారం రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ ఆవరణలో ఎంపీడీవోతో పాటు, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, కార్యదర్శి పి.వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో బి.వెంకటరామన్ పేర్కొన్నారు. శనివారం ఆత్రేయపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వక్తలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో విజయారెడ్డి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.




ఆలమూరు శ్రీసిద్దార్థ స్కూల్‌లో ముందస్తు దసరా ఉత్సవాల్లో ఆకట్టుకున్న విద్యార్థుల అమ్మవారి వేషధారణలు. పక్క చిత్రంలో రాయవరం భాష్యం స్కూల్‌లో అమ్మవార్ల రూపంలో చిన్నారులు

ముందస్తు దసరా వేడుకల్లో విద్యార్థుల సందడి

ఆలమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆలమూరు శ్రీసిద్దార్థ స్కూల్‌లో శనివారం ముందస్తు దసర ఉత్సవాలు నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు వీటిని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల వేషధారణలో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థినీ, విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భాష్యం స్కూల్‌లో..

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరం భాష్యం స్కూల్‌లో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ముందస్తు దసరా వేడుకలు శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిలు అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం వివిధ రకాల అమ్మవార్ల రూపంలో నృత్య ప్రదర్శన చేసిన అనంతరం మహిషాసురుడి సంహార ఘట్టంపై ప్రదర్శన ఆకట్టుకుంది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నవరాత్రి వేడుకల విశిష్టత తెలిపారు. కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, వైస్ ప్రిన్సిపాల్ ద్వారంపూడి చిన్నబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): పండుగలు, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిట్టూరి వెంకటశ్రీధర్ అన్నారు. కపిలేశ్వరపురం మండలం వల్లూరు మండల ప్రజాపరిషత్ పాఠశాలలో శనివారం ముందస్తు దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, ఆకట్టుకుంది. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు జరిపి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టి.సుబ్బారావు, రామతులసి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మహిళలకు టూల్ కిట్లు, యూనిఫాంలు అందజేస్తున్న మంత్రి సుభాష్

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

మంత్రి సుభాష్

ద్రాక్షారామ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పలు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం జూనియర్ కళాశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌ఎస్‌ఈటీఐ సౌజన్యంతో మహిళలకు 35 రోజులపాటు ఇవ్వనున్న వస్త్ర చిత్రకళా ఉద్యమి శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఇంటికో మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ తాడి శ్రీనివాసు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే బండారు

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆలమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శనివారం పరామర్శించారు. భార్యా వియోగంతో ఉన్న టీడీపీ సీనియర్ నాయకుడు కడియాల శ్రీనును పరామర్శించారు. కోనసీమ జిల్లా కోర్టు ఏపీపీ కె.సునీల్ కుమార్ అత్తయ్య మృతి పట్ల బడుగువానిలంకలో ఆయన్ను కలసి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు, ఈదల రాంబాబు, కేతా రాంబాబు, సంకుమల్ల రాముడు, బల్ల హరి, యేరుబండి ధర్మరాజు, దూలం రాంబాబు, పడాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆలమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ తలపెట్టిన రణబేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈనెల 25న గుంటూరులో చేపట్టిన యూటీఎఫ్ రణబేరి సదస్సులకు సంబంధించిన పోస్టర్‌ను ఆలమూరులో యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

స్వస్థ నారీ..సశక్త్ పరివార్ అభియాన్‌ను

సద్వినియోగం చేసుకోండి

కె.గంగవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని దంగేరు వైద్యాధికారిణి కేథరిన్, పేకేరు వైద్యాధికారి ఏ. రేఖారాణి అన్నారు. శనివారం కోట, భట్లపాలిక గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో వారు మాట్లాడారు. అనంతరం మహిళా ఆరోగ్య రక్షణకు స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శి ఎస్.రామకృష్ణ, కూటమి నాయకులు ములకల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


కోటలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ద్రాక్షారామ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏలు తమ సమస్యలు పరిష్కరించాలని రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దారపురెడ్డి వీరభద్రరావు మాట్లా డారు. వీఆర్ఏల ధర్నాకు సంఘం నాయకుడు మద్దాల బాపూజీ మద్దతు తెలిపారు. అనంత రం ఆర్డీవో అఖిలకు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి వచ్చిన వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రావులపాలెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొని సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 65 మందికి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గుత్తుల రాంబాబు, ఈదల సత్యనారాయణమూర్తి, కొప్పిశెట్టి ప్రసాద్, కూసంపూడి రామకృష్ణంరాజు, గనిశెట్టి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి లక్ష్యాలకు చేరుకోవాలి

కొత్తపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా పేర్కొన్నారు. శనివారం అవిడి శివారు చప్పిడిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల క్లాస్ రూమ్స్‌కు వెళ్లి వారితో మాట్లాడారు. కష్టపడి చదవాలని ఆయన సూచించారు. అనంతరం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.అరుణశ్రీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

పాఠశాలకు కుర్చీలు బహూకరణ

మండపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మానవత సేవా సంస్థ సభ్యుడు, వైష్ణవి టైల్స్ యజమాని ఊడి చిన్ననరసన్న శనివారం ద్వారపూడి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు 15 కుర్చీలు అందించారు. విద్యా కమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ సేవా సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పల్ల సన్యాసిరావు, హెచ్ఎం బి.రాజేశ్వరి, పడగల శ్రీనివాస్, డాక్టర్ నాగులాపల్లి సీతారామస్వామినాయుడు, కోట లక్ష్మణ్, పంతంగి ఏడుకొండలు, తటవర్తి రమేష్, పల్లా వాసు, సత్తి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన స్వచ్ఛత హి సేవా సంస్థ

మండపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో శనివారం పంచాయతీ సమీపంలో రైల్వేస్టేషన్ రోడ్డులో స్వచ్ఛత హి సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. విద్యార్థులు, కూటమి నాయకులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కె. మురళీకృష్ణ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.వెంకటరమణ, వై.బాబ్జి తదితరులతో పాటు ఉపాధ్యాయులు భ్రమరాంబ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

కొత్తపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలని కోరుతూ శనివారం కొత్తపేట ఆర్డీవో ఎదుట డివిజన్ స్థాయి వీఆర్ఏలు నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో పి.శ్రీకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ నాయకులు ఆంజనేయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

రావులపాలెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట నియోజకవర్గ టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు దొడ్డపనేని త్రినాథ్ అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో జగన్ ప్రజల కోసం చేసిందేమీ లేకపోయినా మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామంటూ ఫేక్ వీడియోలతో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో వైసీపీ పాలనలో పేమెంట్ సీట్లకు తెరలేపి ఇప్పుడు పేమెంట్ సీట్లంటూ రాద్ధాంతం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గార్లపాటి గోపి, పి.నాగేశ్వరరావు, బి.విష్ణుమూర్తి తదదితరులు పాల్గొన్నారు.

మందపల్లి ఒకరోజు ఆదాయం రూ.2.26 లక్షలు

కొత్తపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,26,275 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తదితరులు తెలిపారు.


శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎల్ఈడీ లైట్లకు చెల్లింపులపై సర్పంచ్‌ల ఆందోళన

ద్రాక్షారామ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఎల్ఈడీ లైట్లకు ప్రభుత్వానికి నిధులు చెల్లించాలని ఆదేశాలు ఇవ్వడంపై పలువురు సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. రామచంద్రపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అంబటి భవానీ అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గత ఐదు ఏళ్లుగా ఎల్ఈడీ లైట్ల నిర్వహణ పంచాయతీలే చేస్తున్నాయని, అయితే ఎల్ఈడీ లైట్లకు సొమ్ము చెల్లించాలని కోరడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు తనకు అధికార కార్యక్రమాల వివరాలు తెలియజేయడంలేదని ఆవేదన వ్యక్తం చేయగా ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ కలుగచేసుకుని ప్రజా ప్రతినిధులు ఏ పార్టీవారికి చెందిన వారైనా వారికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మండల పరిషత్ సమావేశానికి తహసీల్దార్ హాజరు కావడం లేదని, ఆయన తరపున ఎవరూ రావడం లేదని సభ్యులు ఆరోపించారు. దివంగత జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడు వెంకటేశ్వరరావు ప్రతిపాదించిన అభివృద్ధి పనులు పూర్తి చేయించి ఆయనకు గౌరవమైన నివాళి అర్పించాలని సమావేశం అభిప్రాయపడింది. సమావేశంలో వైస్ ఎంపీపీ శాఖా బాబీ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాంబాబు

ఉచిత వైద్య శిబిరం

ఆత్రేయపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకూ దేశవ్యాప్తంగా చేపట్టిన సేవా పక్షోత్సవాలలో భాగంగా శనివారం మహాత్మాగాంధీ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీజేపీ గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ తమనంపూడి రామకృష్ణారెడ్డి, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, బీజేపీ మండల అధ్యక్షుడు ఉమిడిశెట్టి వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి నడింపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచడం, వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలను మార్పు చేయాలి

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు అనువుగా ఉన్న బ్యాంకులో లావాదేవీలు నిర్వహించుకునే వెసులుబాటు కల్పించాలని స్వయం సంఘాలకు చెందిన మహిళలు తమ గోడు వెల్లబోసుకున్నారు. శనివారం పేరవరం సచివాలయంలో 103 స్వయం సహాయక సంఘాల ప్రెసిడెంట్, సెక్రటరీలతో బ్యాంకు అధికారులు సమావేశమయ్యారు. కెనరా బ్యాంక్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఛీఫ్ మేనేజర్ జగనాధకుమార్ నాయక్, డీఆర్‌డీఏ ఏపీఎం గంగాధర్, గ్రామపెద్దలు ముళ్ళపూడి భాస్కరరావు, గంటి నాగేశ్వరరావులతో నిర్వహించిన సమావేశంలో మహిళా సంఘాల ఇబ్బందులను ఏకరువు పెట్టారు. పేరవరానికి చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు ప్రతినెలా పులిదిండి బ్యాంకు వెళ్లాల్సి వస్తుందని దగ్గర్లోని రాజవరం బ్యాంకులో లావాదేవీలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పులిదిండి వెళ్లి బ్యాంకు పని చూసుకుని రావడానికి సమయం పడుతోందని రాజవరం కెనరా బ్యాంకులో లావాదేవీలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

గర్భిణులకు సీమంతాలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆడబిడ్డల ఆరోగ్యం పదిలం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించి పోష్టికాహార ప్రాముఖ్యత గర్భిణిలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మావతి, నాగసత్యవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు

కొత్తపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం జడ్పీ బాలకోన్నత పాఠశాలలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక ప్రాధాన్యం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మండల ప్రజాపరిషత్ ప్రత్యేకాధికారి విజయలక్ష్మి సూచించారు. శనివారం అంగరలో నిర్వహించిన స్వచ్ఛత సేవా కార్యక్రమంలో అమె పాల్గొన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి కంపోస్టు ఎరువు తయారీ గురించి కార్మికులకు పలు సూచనలు అందించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. సంపద తయారీ కేంద్రం ఆవరణలో మెక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తడి పొడి చెత్త వేరు చేయడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానూజీ, ఏవో రాజేంద్రప్రసాద్, సర్పంచ్ కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ వీరన్న, పంచాయతీ కార్యదర్శి ఆర్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.